సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 27 । జనవరి । 2025



సోమశిలలో 68.118 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో ఆదివారానికి 68.118 టీఎంసీలు ఉన్నాయి. 1,849 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3,950 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.83,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,555
3శాతం జీఎస్టీతో	రూ.7,782
నవర (8గ్రా)	రూ.62,256

గరిష్టం/కనిష్టం
32.1 /20.9

వాతావరణం
జిల్లాలో సోమవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. గాలిలో తేమ 65 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌కు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు



జెన్‌కో ఎండీ నుంచి అవార్డు స్వీకరిస్తున్న సీఈ సుధీర్‌బాబు

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో థర్మల్ ప్రాజెక్ట్‌కు ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడ విద్యుత్ సౌదలో 'ఇయర్ ఆన్ ఇయర్ బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు'ను జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు చేతుల మీదుగా చీఫ్ ఇంజినీర్ సుధీర్‌బాబు స్వీకరించారు. విద్యుదుత్పత్తి, ప్రాజెక్ట్ నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు.

రిపబ్లిక్‌డే నాడే విచ్చలవిడిగా మద్యం



ఆత్మకూరులో బహిరంగంగా మద్యం తాగుతున్న ఓ వ్యక్తి

ఆత్మకూరు: గణతంత్ర దినోత్సవం రోజు మద్యం విక్రయాలు చేయకూడదనే నిబంధనలను బేఖాతరు చేస్తూ.. ఆదివారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో అనధికారికంగా మద్యం విక్రయాలు చేపట్టారు. మందుబాబులు బహిరంగంగా మద్యం తాగుతూ కనిపించారు. ముందుగానే పలు లైసెన్స్‌డ్ దుకాణదారులు తమ దుకాణాల్లోని మద్యాన్ని బెల్టు దుకాణాలకు చేర్చి చాటుగా విక్రయాలు చేయించారని తెలుస్తోంది. మరికొందరు బయటకు తరలించి.. రహస్య ప్రదేశాల్లో ఉంచి మద్యం విక్రయాలు సాగించినట్లు సమాచారం. జాతీయత గౌరవాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ.. మద్యం వ్యాపారులు బరి తెగింపుతో అమ్మకాలు చేపట్టడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. దేశ గౌరవాన్ని కాపాడుకునేందుకు కనీసం ఒక్క రోజు కూడా మద్యం విక్రయాలు ఆపలేకపోయారా? అంటూ కొందరు మండిపడ్డారు.

కౌలు నగదును చెల్లించేలా చర్యలు చేపట్టాలి

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లిలో కొలువైన మూలస్థానేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూముల్లో వరిసాగు చేసుకునేందుకు నిర్వహించిన కౌలు వేలం పాటలో భూములు దక్కించుకున్న లీజుదారులు పూర్తిగా నగదు చెల్లించేలా చర్యలు చేపట్టాలని తాటిపర్తిపాళెం గ్రామానికి చెందిన గుమ్మా మోహన్ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తాటిపర్తిపాళెం సర్వే నంబరు 1110లోని 4 ఎకరాలు, సర్వే నంబరు 1109–2లోని ఎకరా, సర్వే నంబరు 1131లోని 0.34 సెంట్ల భూమికి సంబంధించి 2024 నవంబరు 9న కౌలు వేలం నిర్వహించారని, తాటిపర్తిపాళెంకు చెందిన నిక్కుదల రమేష్ రూ.1.80 లక్షలు, నిక్కుదల వెంకయ్య రూ.55 వేలకు, బుజ్జా సుధాకర్ రూ.81 వేలకు వేలం దక్కించుకున్నారని పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు వేలం నగదును పూర్తి స్థాయిలో దేవస్థానానికి చెల్లించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవదాయశాఖాధికారులు సైతం కౌలు లీజుదారులకు కొమ్ముకాస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపి దేవస్థానానికి పూర్తి స్థాయిలో నగదు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి



పోలీసుల అధికారుల గౌరవ వందనాన్ని స్వీకకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

- కలెక్టర్ ఆనంద్
- పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ సంబరాలు
- అబ్బుర పరిచిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు
- 310 మందికి ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానం

విద్యాభివృద్ధికి విశేష కృషి

జిల్లాలో విద్యాభివృద్ధికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా 1,72,000 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.45.40 కోట్లతో 8 రకాల వస్తువులను స్టూడెంట్స్ కిట్స్ రూపంలోఅందించామన్నారు. 2025 జనవరి 4 నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హైస్కూలు ప్లస్, మోడల్ స్కూళ్లలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు తొలిసారిగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు.

నెల్లూరు (అర్బన్): వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను సమర్థ వంతంగా అమలు చేస్తూ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్ ఆనంద్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్, ఎస్పీ జిల్లా శాంతియుతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శాంతి కపోతాలను ఎగురవేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ఉపాధి, నైపుణ్య–మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, రైతులకు వ్యవసాయ సాంకేతికత, గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్, ఇంధనం–డబ్బు ఆదా, ఉత్పత్తి పరిపూర్ణత, స్వచ్ఛ ఆంధ్ర, అందరికీ డీప్ టెక్నాలజీ లక్ష్యాలను జిల్లాలో సాధించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నారు.

వ్యవసాయాభివృద్ధికి సహకారం

జిల్లాలో ఉపాధి ప్రధాన రంగమైన వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన 1,67,270 మంది రైతులకు రూ.6 వేల చొప్పున 2024–25 సంవత్సరానికి రూ.66.75 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. ఈ ఏడాది వరి, వేరుశనగ, శనగ, పెసర, మినుము విత్తనాలను 24,800 మంది రైతులకు సబ్సిడీపై అందించామన్నారు. 22,724 ఎకరాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నీటి పారుదల పనులకు రూ 28.4 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లాలో 424 వ్యవసాయ ఫీడర్ల ద్వారా 2,04,000 మంది వ్యవసాయ వినియోగదారులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి..

ఎన్టీఆర్ భరోసా కింద అర్హులైన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.4 వేల చొప్పున 3,09,273 మందికి రూ.132.15 కోట్లు పెన్షన్ నగదును ఇంటి వద్దనే ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా 11,021 డ్వాక్రా సంఘాలకు రూ. 874.52 కోట్లు రుణ సదుపాయం కల్పించామన్నారు. జిల్లాలో 770 కి.మీ. రోడ్లకు మరమ్మతులు చేస్తున్నామన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద రూ.288 కోట్లతో ఫిషింగ్ హార్బర్ పనులు జరుగుతున్నాయన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ, ఆత్మకూరు, కందుకూరు. కావలి, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు పరిధిలో అమృత్ పథకం కింద రూ.359.22 కోట్ల అంచనాలతో తాగునీటి సరఫరా పథకాల పనులు జరుగుతున్నాయన్నారు. నెల్లూరు, కావలి మున్సిపాలిటీల్లో అమృత్ పథకం కింద రూ 246.39 కోట్ల అంచనాలతో భూగర్భ డ్రైనేజి పనులు, సీవరేజి ట్రీట్మెంట్ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం ద్వారా మొదటి కాన్పు చేయించుకున్న గర్భిణులకు, రెండో కాన్పులో అమ్మాయి పుట్టినందుకు 17,994 మందికి వారి బ్యాంకు ఖాతాలకు రూ.6.28 కోట్లు జమ చేశామన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా 43,842 మందికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలకు రూ.96 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి, డీఆర్‌ఓ ఉదయ భాస్కర్‌రావు, ఆర్డీఓలతోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో జేసీ, ఎస్పీ తదితరులు

దేశ రాజ్యాంగం అత్యుత్తమం

- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

నెల్లూరు (బారకాసు): ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యుత్తమం అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంలోని హక్కులతో పాటు బాధ్యతలను కూడా పౌరులు తెలుసుకోవాలని సూచించారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురు వేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా దేశ ప్రజలకు హక్కులను కల్పించిన భారత రాజ్యాంగం అమలు ప్రతి ఒక్కరికీ ముఖ్యమని తెలిపారు. అంబేడ్కర్ కృషి ఫలితంగానే దేశంలో వెనుకబడిన వర్గాలు ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. భిన్న జాతులు, మతాలు, భాషలు, సంస్కృతుల, కులాలు ఉన్న భారతదేశంలో నేటికీ సమైక్యంగా కొనసాగుతున్నాం అంటే అందుకు అంబేడ్కర్ ఆధ్వర్యంలో రాసిన రాజ్యాంగమే కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జెండా ఎగురు వేస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

గణతంత్ర వేడుకలకు ప్రజాప్రతినిధులు డుమ్మా

- జాతీయ పండగకు గౌరవమివ్వని వైనం
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాత్రమే హాజరు

నెల్లూరు (అర్బన్): ప్రపంచంలోనే ఎంతో పేరున్న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన గణతంత్ర దినోత్సవ పండగకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం 76వ గణతంత్ర వేడుకలు జరిగాయి. స్వాతంత్ర్య పోరాట యోధులను స్మరించుకుంటూ, భారతరాజ్యాంగ నిర్మాతలను గౌరవించుకుంటూ, బ్రిటిష్ రాజ్యాంగాన్ని కాలదన్ని సొంత రాజ్యాంగాన్ని రాసుకుని గర్వంగా అమలు చేసుకున్న రోజున జరుపుకునే గణతంత్ర వేడుకలు పూర్తిగా కలెక్టర్, అధికారుల పర్యవేక్షణలో మాత్రమే జరుగుతాయి. అయినప్పటికీ ప్రతి సంవత్సరం జరిగే వేడుకలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు గౌరవ అతిథులుగా హాజరై జాతీయ జెండాను గౌరవించడం ఆనవాయితీ. వీరి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి చెందిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాత్రమే హాజరయ్యారు. ప్రజాప్రతినిధుల కోసమని కేటాయించిన రెండు వరుసలు ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చాయి. జిల్లాలో మొత్తం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు అధికార పార్టీవే. అయినా వారిలో ఒక్కరంటే ఒక్కరికీ కూడా గణతంత్ర వేడుకలకు రావాలన్నా ఆలోచనే రాకపోవడం దారుణం. ఇదేనా ప్రజాప్రతినిధులు జాతీయ జెండాకు ఇచ్చే గౌరవం అంటూ అక్కడికి వచ్చిన పుర ప్రముఖులు విమర్శించారు.



ప్రజాప్రతినిధుల వరుసలో కేవలం ఆనం అరుణమ్మ ఒక్కరే కూర్చుని ఉన్న దృశ్యం

నేటి నుంచి సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు మూడు రోజుల పాటు ఆంధ్రరాష్ట్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ ప్రాంత వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ.. సింహపురి సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. నగరంలోని బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు నగరంలోని ముత్తుకూరుగేట్ సెంటర్ వద్ద సాయంత్రం ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి సాంస్కృతిక కళాకారులు వందల సంఖ్యలో వస్తారని, మొదటి రోజు సోమవారం ఈ ఉత్సవాలను ప్రముఖ సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ ప్రారంభిస్తారని, మంగళవారం నిర్వహించే కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసు బ్రమణ్యం పాల్గొంటారని, చివరి రోజు బుధవారం ముగింపు కార్య క్రమానికి తెలంగాణ ఎమ్మెల్సీ, ప్రజావాగ్గేయకారుడు గోరటి వెంకన్న పాల్గొంటారని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో నిర్వహించే సింహపురి సాంస్కృతిక ఉత్సవాల ఆహ్వాన పోస్టర్లను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ సమావేశంలో సాంస్కృతిక సబ్‌కమిటీ కన్వీనర్ మంగళ పుల్లయ్య, రెహనాబేగం, విజయ్‌కుమార్, శీనయ్య పాల్గొన్నారు.



ఉత్సవాల ఆహ్వాన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



మాస్టారూ.. ఇది తగుదునా!

ఎన్నికల వరకు అరచేతిలో వైకుంఠం

- అధికారం దక్కాక.. ఓట్ల తులాభారం
- జెండా మోసిన కార్యకర్తలను, నేతలను పట్టించుకోని మంత్రి నారాయణ
- పని కోసం వెళ్తే.. ఓటింగ్ పర్సంటేజ్ చూపిస్తున్న వైనం
- టీడీపీకి 85 శాతం ఓట్లు పోలైన బూత్‌ల్లోని నేతలకే పనిచేస్తానని స్పష్టీకరణ
- మంత్రి కోటరీలోని ఇద్దరు ముగ్గురు నేతలదే పెత్తనం
- పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్ల పరిస్థితి దీనం

'ఎన్నికల వరకు ఓడ మల్లన్న.. గెలిచాక బోడి మల్లన్న' చందాన.. నెల్లూరు నగర నియోజక వర్గంలో మంత్రి నారాయణ వ్యవహరిస్తున్న తీరు పార్టీ కేడర్‌కు కంటగింపుగా మారింది. ఎన్నికల సమయంలో ఇటు పార్టీ కేడర్ తోపాటు అటు తన విద్యా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులను ఇంటింటికి తిరిగి ప్రతి ఓటు టీడీపీకి పడేలా చూడాలని.. అధికారంలోకి వస్తే.. అందరి భవిష్యత్‌కు అండగా ఉంటానని ఎన్నెన్నో చెప్పారు. అధికారం దక్కాక.. ప్రజలను మోసం చేసినట్లు పార్టీ కేడర్‌ను, తన ఉద్యోగులను విస్మరించారు. ఏదైనా పని చేసి పెట్టమని వెళ్తే.. ఓట్ల తులాభారాన్ని చూపించి వెళ్లగొట్టుతున్న వైనంతో తీవ్ర అవమాన భారంతో పార్టీ కేడర్ కుంగిపోతున్నట్లు తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : నెల్లూరు నగర నియోజకవర్గంలో టీడీపీ కోసం దశాబ్దాలుగా కష్టపడి పని చేసిన క్షేత్ర స్థాయి నాయకులు, కార్యకర్తలను మంత్రి నారాయణ పురుగుల్లా చూస్తున్నారని కేడర్ గొల్లుమంటోంది. ఎన్నికల ముందు పార్టీ కార్యకర్తలు, నాయకులకు అరచేతిలో స్వర్గం చూపించారు. అధికారం దక్కితే.. మీ డివిజన్‌లో మీరే లీడర్లు.. మీరు చెబితేనే ఎవరికైనా ఏదైనా చేస్తానంటూ కబుర్లు చెప్పారు. పార్టీలో పదవుల నుంచి పథకాల వరకు అన్నీ మీ అనుమతి మేరకే చేస్తానంటూ ఊరించారు. ఇక తన విద్యా సంస్థల్లో పనిచేసే ప్రైవేట్ సైన్యాన్ని రంగంలోకి దింపారు. వీరితోపాటు డివిజన్ల వారీగా నెల జీతానికి కొందరిని నియమించుకున్నారు. అధికారంలోకి రాగానే ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేసి మీ సంక్షేమానికి కృషి చేస్తానని హామీలిచ్చారు. తన ఆస్పత్రిలో వైద్యసేవల్లో ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. దీంతో వీరందరూ ఇంటింటికి తిరిగి ప్రతి ఓటరును కలిసి టీడీపీ అధికారంలోకి వస్తే.. మీ కుటుంబానికి ఇంతంత లబ్ధి చేకూరుతుందని చెప్పి.. ఓట్లు వేయించారు.

అధికారం దక్కగానే.. అందరూ బోడి మల్లన్నలే..

నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నారాయణ మీద నమ్మకంతో అటు పార్టీ కేడర్‌తో పాటు ఇటు తన ప్రైవేట్ సైన్యం కూడా ఆయన గెలుపు కోసం అహర్నిశలు శ్రమించారు. ఎన్నికల్లో ఆ పార్టీ అధికారంలోకి రావడం, నారాయణ మంత్రి కావడంతో తన విజయం కోసం అలుపెరగని కృషి చేసిన వారందరూ బోడి మల్లన్నలు అయ్యారు. టీడీపీ అధికారంలోకి వస్తే.. మనదే పెత్తనం.. మీకేం కావాలన్నా.. చేసి పెడతానంటూ ప్రజలకు హామీలిచ్చిన డివిజన్ ఇన్‌చార్జిలు ఇప్పుడు అదే ప్రజలకు ముఖం చాటేస్తున్నారు. ప్రజలు పథకాలు అందడం లేదని అడిగేందుకు వెళ్లినా.. ఏదైనా పని చేసి పెట్టమని అడగాలన్నా.. అందుబాటులో లేరని స్థానికులు వాపోతున్న పరిస్థితి కనిపిస్తోంది.

పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో కీలకంగా వ్యవహరించిన నెల్లూరుకు చెందిన రాష్ట్ర స్థాయి నాయకురాలు తన డివిజన్‌లోని కార్యకర్తలకు పని చేయాలని నారాయణ వద్దకు తీసుకెళ్లింది. అయితే ఆయన మాత్రం నీ డివిజన్‌లో 70 శాతం కన్నా తక్కువగా టీడీపీకి ఓట్లు పోల్ అయ్యాయని, పనిచేయడం కుదరదని ముఖం మీదే చెప్పి పంపేశారంట. ఆ నాయకురాలు పార్టీ కేడర్ ముందు అవమాన భారంతో కన్నీరుమున్నీరుగా విలపించినట్లు సమాచారం. ఇందుకేనా ఆయన్ను గెలిపించుకుందంటూ అసహనంతో రగిలిపోతోందంట.

జెండావీధికి చెందిన ఓ వ్యక్తి తన కుమారుడికి ఉద్యోగం కల్పించాలని నారాయణను కోరారు. వెంటనే నారాయణ పక్కన ఉన్న ఓ ఉద్యోగి ల్యాప్‌టాప్ తీసి అతని పేరు, బూత్ నంబర్ టైప్ చేశారంట. అతని బూత్‌లో టీడీపీకి 60 శాతం మాత్రమే పోలైందని సమాచారం వచ్చింది. దీంతో నువ్వేమి పార్టీ కోసం పని చేయలేదంటూ నారాయణ ఆ వ్యక్తిని కడిగిపారేశారని సమాచారం. నువ్వు పనిచేయకుండా మళ్లీ నీ కుమారుడికి ఉద్యోగం అడుగుతున్నావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారంట. అవమానంతో ఆయన అక్కడి నుంచి కుమారుడిని తీసుకుని బయటకెళ్లిపోయాడని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఓట్ల తులాభారం..

అధికారంలో ఉన్న మంత్రి నారాయణ వద్దకు తమ పిల్లలకు ఉద్యోగం కల్పించమనో.. ఏదైనా ప్రాజెక్ట్ కోసమో.. కాంట్రాక్ట్ పని కోసమో.. మరే ఇతర పని మీద వెళ్తే ల్యాప్‌టాప్ ఓపెన్ చేసి.. పని కోసం వచ్చిన వ్యక్తి పేరు, బూత్ నంబర్ అడిగి.. నీ బూత్‌లో టీడీపీకి 85 శాతం ఓట్లు పోల్ కాలేదంటూ ఓట్ల తులాభారాన్ని చూస్తున్నట్లు సమాచారం. నువ్వు పార్టీ కోసం పనేం చేయలేదంటూ, నీ పని చేయనంటూ ముఖానే చెబుతూ ఆత్మగౌరవంపై దెబ్బ కొడుతున్నారని పలువురు నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్ అధ్యక్షుడు, బూత్ ఇన్‌చార్జికి చెప్పండి

మీ పరిధిలో ఏదైనా సమస్యలు ఉంటే మీ డివిజన్ అధ్యక్షుడికి కానీ, బూత్ ఇన్‌చార్జికి గానీ చెప్పుకోవాలని మంత్రి నారాయణ సూచిస్తున్నారు. ప్రతి రోజూ నారాయణ మహిళా టీం, యూత్ టీం, నారాయణ టీంతో గ్రూప్ కాల్ నిర్వహిస్తున్నారు. అయితే మూడు నెలల క్రితం 3,600 మంది వరకు గ్రూప్ కాల్‌కు హాజరయ్యేవారు. అయితే ఇప్పుడు కేవలం 2,000 నుంచి 2200 మంది మాత్రమే హాజరవుతున్నారు. అటెండ్ అవుతున్న వారు కూడా నారాయణ మాటలు మనిషే.. చేతల మనిషి కాదని తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

ఇద్దరు.. ముగ్గురిదే పెత్తనం

నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ కుటుంబ సభ్యులు ఇద్దరు.. ముగ్గురిదే పెత్తనంగా మారింది. నారాయణను కలవాలంటే ఆ ఇద్దరు ముగ్గురు నేతల అనుమతి లేనిదే కలవనీయడం లేదని తెలుస్తోంది. నారాయణను కలుసుకోవాలంటే.. ఎదురు చూపులు తప్పడం లేదు. నెలలో ఎక్కువ సమయం అమరావతిలోనే ఉంటున్నారు. నాయకులు, కార్యకర్తలు కూడా తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మనోవేదన పడుతున్నారు. నారాయణ గెలిస్తే తమ భవిష్యత్‌లు మారిపోతాయని, తమ పిల్లలు, స్నేహితులకు ఉద్యోగాలు కల్పించుకోవచ్చని, ఏదైనా కాంట్రాక్ట్ పనులు చేసుకోవచ్చని ఆశగా గెలిపించుకున్న టీడీపీ కేడర్ ఇప్పుడు నారాయణను కలవాలంటేనే కష్టంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

పార్టీ ఫిరాయించిన నేతల పరిస్థితీ అంతే..

టీడీపీ అధికారంలోకి రావడంతో నగర పాలక సంస్థలోని కొందరు కార్పొరేటర్లతోపాటు మరికొందరు నేతలు పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరారు. ఇటువంటి వారందరని మంత్రి నారాయణ పురుగుల కంటే హీనంగా చూస్తున్నట్లు సదరు నేతలు తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారంట. కనీసం తనను కలవడానికి కూడా వారికి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని తెలుస్తోంది. టీడీపీలో చేరితే.. పనులు చక్కబెట్టుకోవచ్చని ఆశపడిన వీరికి అవమానం తప్ప.. అవకాశాలు రావడం లేదని వాపోతున్నారు.

గణతంత్ర సంబరం



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(అర్బన్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో ఆదివారం వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కోవూరు బాలికల జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల విద్యార్థినులు పాడుదమా.. స్వేచ్ఛాగీతం, బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు జనగణమన గీతం, ముత్తుకూరుకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికలు హమ్ ఇండియా వాలే నృత్య గీతిక, ఓవెల్ మోడరన్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన శాంతినికేతం గీతం – ఇది సబర్మతి సందేశం, కావలి చెందిన ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ హైస్కూల్ ప్రదర్శించిన దేశభక్తి గీతం, అలాగే గొలగమూడి బీసీ ఆశ్రమ పాఠశాల బాలికల నృత్యాలు అలరించాయి. వారికి కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

- వివిధ శాఖలు స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేశాయి. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శకటం మొదటి బహుమతిని గెలుచుకుంది. రెండో బహుమతిని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మూడో బహుమతిని పశు సంవర్ధక శాఖ శకటాలు అందుకున్నాయి.





వెంకటాచలం మండలం గొలగమూడి బీసీ ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన



కోవూరు జెడ్పీ బాలికల హైస్కూల్



స్త్రీ, శిశు సంక్షేమ శాఖ శకటం



కవాతు మైదానంలో పోలీసులు



కావలి ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన



నృత్యం చేస్తున్న ముత్తుకూరు గురుకుల పాఠశాల విద్యార్థులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

ఉత్తమ సేవలకు ప్రశంసలు

నెల్లూరు(అర్బన్): సంవత్సర కాలంలో ప్రజలకు సేవలందించిన ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అలాగే స్వచ్ఛంద సంస్థల సభ్యులకు, క్రీడాకారులు తదితర 310 మందికి కలెక్టర్ ఆనంద్ ప్రశంసాపత్రాలను అందజేశారు. వీరిలో ప్రధానంగా నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ, జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి, డ్వామా పీడీ గంగా భవానీ, నెల్లూరు ఆర్డీఓ అనూష, పెద్దాస్పత్రి వైద్యులు తదితరులున్నారు.



కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ



సత్యవాణి, వ్యవసాయ శాఖ | గంగా భవానీ, డ్వామా పీడీ | అనూష, నెల్లూరు ఆర్డీఓ | శీనానాయక్, స్పెషల్ కలెక్టర్ | విజయ్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ | అబ్దుల్, జేసీ సీసీ | డాక్టర్ మస్తాన్‌బాషా, పెద్దాస్పత్రి | డాక్టర్ శోభారాణి, పెద్దాస్పత్రి | ఉమామహేశ్వరి, ఇమ్యూనైజేషన్ అధికారి



కనకరత్నం, వైద్యశాఖ | వంకదారి అంకయ్య, మెప్మా | డాక్టర్ గంగాధరం, ఆయుర్వేద జిల్లా ఆఫీసర్ | అనూరాధ, సీడీపీఓ | అజయ్‌బాబు, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ | నందన్, అదనపు కమిషనర్ | హిమబిందు, సిటీ ప్లానర్ | రామ్మోహన్‌రావు, ఎస్ఈ

పోలీస్ శాఖలో..

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ జి.కృష్ణకాంత్‌లు ప్రశంసాపత్రాలు అందజేశారు.



శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ | శ్రీధర్, కావలి డీఎస్పీ



కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏఆర్ ఏఎస్పీ మునిరాజు



ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ | ఎస్.చంద్రమోహన్, ఏఆర్ డీఎస్పీ | ఎ.సురేంద్రబాబు, బుచ్చి సీఐ | సాంబశివరావు, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్



కె.రామకృష్ణ, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ | రవినాయక్, కృష్ణపట్నం పోర్టు సీఐ | జి.మంగారావు, గుడ్లూరు సీఐ | డి.వెంకటేశ్వరరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్



బి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ | వేణు, నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ | అంకమరావు, ఎంటీ ఆర్ఐ | తిరుమలరెడ్డి, ఆర్ఎస్సై | చంద్రమౌళి, ఆర్ఎస్సై | సీతారామయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ | దశరథరామారావు, సంతపేట ఇన్‌స్పెక్టర్ | రామారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ | ఎ.వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా సెల్

క్రీడా విభాగంలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా పలువురు జాతీయ క్రీడాకారులు, డీఎస్‌డీఏ అధికారులు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఖోఖో కోచ్ సుకుమార్



కోటగిరి కోటయ్య, కబడ్డీ కోచ్ | అక్షయ్ మహదేవ్, ఆర్చరీ క్రీడాకారుడు | నాగదర్శన్, రోలర్ స్కేటింగ్



వి.రాకేష్, రోలర్ స్కేటింగ్ | రమణ, సాఫ్ట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు | వరుణ్‌రెడ్డి, పెన్‌కాక్ సిలాట్



ప్రసాద్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎస్సై | లక్ష్మణ్, నెల్లూరు రూరల్ ఎస్సై | సుబ్రహ్మణ్యం, చిన్నబజారు ఎస్సై | చంద్రమౌళి, డీపీఓ ఏఓ

చందన, సీఎంఆర్ సంక్రాంతి బంపర్ డ్రా

నెల్లూరు(బృందావనం): సంక్రాంతి సందర్భంగా ఆదివారం చందన, సీఎంఆర్ బంపర్ డ్రాను టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తీశారు. టాటా టియాగో కారు విజేతగా వెంకటాచలం మండలం పూడిపర్తి ఎగువమిట్టకు చెందిన జి.అరుణ, వీక్లీ స్కూటీ (టీవీఎస్ జెస్ట్) విజేతగా బి.శ్రేయాన్స్‌ను ప్రకటించారు. అలాగే 35 మంది డైలీ డ్రా విజేతలకు గ్రైండర్, మిక్సీ, రైస్‌కుక్కర్, డిన్నర్‌సెట్లను అందజేశారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ చందన, సీఎంఆర్ సంస్థలు రాష్ట్రంలో అనేక బ్రాంచ్‌లు నెలకొల్పి అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందాయన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, మోపూరు పెంచలయ్య, టీడీపీ నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, దాట్ల చక్రవర్తిరెడ్డి, హరిణి, జెడ్ శైలేష్, మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 138
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 270
లేయర్ చికెన్ : 145



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.18
పండ్లు : రూ.10



కప్పరాళ్లతిప్ప వద్ద తప్పిన ప్రమాదం

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప వద్ద ఏషియన్ హైవేపై ఆదివారం త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న ట్రాలీ లారీ తిప్ప వద్ద ఫ్లై ఓవర్ దిగే సమయంలో అదుపుతప్పి డివైడర్ మీదుగా అవతలి రోడ్డులోకి దూసుకొచ్చింది. అదే సమయంలో అవతలి రోడ్డులో చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని ట్రాలీ లారీ ఢీకొట్టి నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాలీ లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. ఈ సమయంలో వాహనాల రాకపోకలు పెద్దగా లేకపోవడంతో త్రుటిలో భారీ ప్రమాదం తప్పింది. కాగా రోడ్డు ప్రమాదం కారణంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో బిట్రగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఘటనా స్థలంలో వాహనాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అల్లూరు: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లూరులో జరిగింది. ఎస్సై కిశోర్‌బాబు ఆదివారం వివరాలు వెల్లడించారు. మారుతి కాలనీకి చెందిన తంబి సురేష్ (35)కు మద్యం అలవాటు ఉంది. దీంతో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. శనివారం అతడి భార్య జీవన తన ఇద్దరి పిల్లలను తీసుకుని ఆస్పత్రికి వెళ్లింది. తిరిగి ఇంటికొచ్చేసరికి సురేష్ ఉరేసుకుని ఉన్నాడు. జీవన కేకలు వేయగా ఇంటి చుట్టుపక్కల వారు వచ్చి అతడిని అల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అల్లూరు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సురేష్ (ఫైల్)